క్లుప్తంగా

19న ఛత్రపతి శివాజీ జయంతి ర్యాలీ

నెల్లూరు(బృందావనం): నగరంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ర్యాలీని ఆదివారం సాయంత్రం నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ నేతలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఆర్సీ మైదానం నుంచి నిర్వహించనున్న ర్యాలీకి తరలి రావాలని కోరారు.

నగరంలో విస్తృత తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): నగరంలో వరుస దొంగతనాల నేపథ్యంలో పోలీస్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ విజయారావు ఆదేశాల మేరకు నగర డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి నేతృత్వంలో అధికారులు విస్తృత తనిఖీలను గురువారం రాత్రి చేపట్టారు. స్థానిక పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి శివారు ప్రాంతాలు, నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి ఎక్కడి నుంచి వస్తున్నారు.. ఎక్కడికెళ్తున్నారాననే వివరాలను సేకరించి ఫిన్స్ సాయంతో వేలిముద్రలు తీస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక శక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నగర ఇన్‌స్పెక్టర్లు సురేంద్రబాబు, సుబ్బారావు, అన్వర్‌బాషా, సీతారామయ్య, నరసింహరావు, రాములునాయక్ పాల్గొన్నారు.

పన్నుల వసూలు పూర్తి చేయాలి

కొడవలూరు : మార్చి ఆఖరు కల్లా ప్రతి పంచాయతీలో వంద శాతం ఇంటి పన్నుల వసూలు పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ, ఇన్‌చార్జి డీపీఓ చిరంజీవి సూచించారు. కొడవలూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పన్నుల వసూళ్లకు 40 రోజుల గడువు ఉన్నందున ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. వసూళ్లలో వెనుకబడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నందున ఈ కార్యక్రమం అన్ని పంచాయతీల్లో విజయవంతంగా జరగాలన్నారు. ప్రతిఇంటి నుంచి చెత్త సేకరించడంతో పాటు చెత్తతో సంపద కేంద్రానికి తరలించాలన్నారు. చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వానపాముల ఎరువును విధిగా ఉత్పత్తి చేయాలని చెప్పారు. ఇప్పటికీ వినియోగంలోకి రాని కేంద్రాలుంటే వెంటనే అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో డీఎల్‌పీఓ ఆదినారాయణ, ఎంపీడీఓలు పి.సుబ్రహ్మణ్యం, శ్రీదేవి, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రూ.55 వేల కోట్లతో విద్యా వ్యవస్థ అభివృద్ధి

బుచ్చిరెడ్డిపాళెం(విడవలూరు): రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థ అభివృద్ధికి రూ.55 వేల కోట్లు ఖర్చు చేసిందని వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి పి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డితో కలిసి విడవలూరులోని సాయిబాబా కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలుస్తున్నానని, ఈ సారి ప్రైవేట్ టీచర్లకు కూడా ఓటింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించారని తెలిపారు. దాదాపు ఆరు జిల్లాల్లోని 36 నియోజకవర్గాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, ఆయన సారథ్యంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు తనతోపాటు తమ పార్టీ అభ్యర్థులకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో విడవలూరు సర్పంచ్ ప్రవీణ్, నాయకులు జనార్దన్‌రెడ్డి, మురళి, శశి, సురేంద్రరెడ్డి, తాతా ప్రభాకర్, వెంకటేశ్వర్లు, వివేకానందరెడ్డి, అయ్యప్ప, మల్లికార్జున్‌రావు, శ్రీధర్, మస్తానయ్య, రాధయ్య, తిరుపతి, శ్రీనివాసులు, ఆవుల వాసు, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కరుణాకర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు

తోటపల్లిగూడూరు: యువత మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని, చెడు మార్గంలో పయనించకుండా జాగ్రత్త పడాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బాలకృష్ణ సూచించారు. 'మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు, పోక్సో చట్టం, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్' అనే అంశాలపై శుక్రవారం మండలంలోని చిన్నచెరుకూరు, తోటపల్లిగూడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎస్‌ఈబీ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈబీ సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలను వినియోగించి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకొంటున్నారన్నారు. అనంతరం మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి పోస్టర్ ఆవిష్కరించారు.

భక్తులకు ఇక్కట్లు తలెత్తకూడదు

• ఎస్పీ విజయారావు


భద్రత ఏర్పాట్లపై చర్చిస్తున్న విజయారావు

నెల్లూరు(క్రైమ్): మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇక్కట్లు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎస్పీ విజయారావు ఆదేశించారు. మూలాపేటలోని మూలస్థానేశ్వరాలయంలో బందోబస్తు ఏర్పాట్లను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా చూడాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్దేశిత ప్రాంతాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయించాలని చెప్పారు. అవాంఛనీయ ఘటనల కు తావులేకుండా భద్రతను కట్టుదిట్టం చేయాలని సూచించారు. నేర నియంత్రణకు సీసీఎస్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అనుమానిత వ్యక్తుల వివరాలు, వేలిముద్రలను సేకరించాలని పేర్కొన్నారు. భక్తులు క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకోవాలన్నారు. ఏఎస్పీ హిమవతి, నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వీరాంజనేయరెడ్డి, చిన్నబజార్, ఎస్బీ సీఐలు సురేంద్రబాబు, మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

శేషవాహనంపై మూలస్థానేశ్వరుడి విహారం



నెల్లూరు(బృందావనం): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలను గురువారం నిర్వహించారు. శేషవాహనసేవను రాత్రి జరిపారు. చప్పరోత్సవానికి ఉభయకర్తలుగా బాలయ్య, రామచంద్రయ్య, రాజ్యలక్ష్మి, ఉదయ్‌కుమార్, కుసుమప్రియ వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వెండిరావణ సేవను శుక్రవారం రాత్రి ఏడు గంటలకు నిర్వహించనున్నారు.

అరసం రాష్ట్ర కార్యవర్గంలో రామకృష్ణకు స్థానం

నెల్లూరు(బృందావనం): అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యుడిగా జిల్లా నుంచి పెరుగు రామకృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు వివరాలను గురువారం ఆయన తెలియజేశారు. అరసం 19వ రాష్ట్ర మహాసభలను తెనాలిలో ఈ నెల 11, 12వ తేదీల్లో నిర్వహించారని చెప్పారు. రాష్ట్ర కార్యవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, శివప్రసాద్ నాయకత్వాన ఏర్పాటైందని చెప్పారు. సభ్యుడిగా మూడేళ్ల పాటు కొనసాగనున్నానని తెలిపారు.

ఆహార పొట్లాల అందజేత



నెల్లూరు(బృందావనం): రంగనాయకులపేట, గోపురంవీధి, రైలువీధి, తదితర ప్రాంతాల్లో నిరుపేదలు, దివ్యాంగులు, తదితరులకు ఆహార పొట్లాలను గురువారం అందజేశారు. తమ కుమారుడు అఖిల్ జన్మదినాన్ని పురస్కరించుకొని వీటిని అందజేశామని విలియమ్ దంపతులు తెలిపారు. చంద్ర, రమేష్, శేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముఖహాజరు నుంచి మినహాయింపునివ్వరూ..

నెల్లూరు సిటీ: నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు ముఖహాజరు నుంచి మినహాయింపునివ్వాలని సీఐటీయూ నేతలు కోరారు. ఈ మేరకు మేయర్ స్రవంతికి వినతిపత్రాన్ని గురువారం అందజేశారు. సీఐటీయూ కార్యదర్శి పెంచలయ్య, రూరల్ కార్యదర్శి దేశమూర్తి, నేతలు శ్రీనివాసులు, లోకేష్, చెన్నయ్య, రాజమ్మ, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆత్మీయ సమావేశం రేపు


మాట్లాడుతున్న పద్మాకర్

నెల్లూరు(బారకాసు): న్యాయవాదుల ఆత్మీయ సమావేశాన్ని ఎస్సీ, ఎస్టీ అడ్వొకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్నామని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మాకర్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడారు. ఆర్టీసీ సమీపంలోని ఏనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో సమావేశాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించనున్నామన్నారు. అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిపై ముగ్గురు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల సమాచారం మేరకు.. కటారిపాళెంలో సాయిలాహుల్ నివాసం ఉంటున్నారు. అదే ప్రాంతానికి చెందిన నారాయణ, భాను, కార్తీక్ వీధి చివర్లోని కాలువ వద్ద మూత్రవిసర్జనకు బుధవారం వచ్చారు. మూత్ర విసర్జన చేయొద్దన్నదందుకు సాయిలాహుల్‌పై వారు సుత్తితో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

త్వరితగతిన కౌన్సెలింగ్ జీఓ ఇవ్వాలని వినతి



నెల్లూరు(టౌన్): డీఎస్సీ – 98 అభ్యర్థులు ఎమ్మెల్సీ కల్పలతారెడ్డిని గురువారం కలిశారు. నగరంలోని కృష్ణచైతన్య కళాశాలలో వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాలిరెడ్డి, ఎమ్మెల్సీకి వినతిపత్రాన్ని అందజేశారు. కౌన్సెలింగ్ జీఓను త్వరితగతిన ఇవ్వాలని కోరారు. డీఎస్సీ – 98 అభ్యర్థుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి బెంగళూరు యువకుడి ఆత్మహత్య


శశికుమార్ (ఫైల్)

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు వైపు వస్తున్న యశ్వంతపూర్ ఎక్స్‌ప్రెస్ కిందపడి బెంగళూరు యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విజయమహల్ గేట్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఘటనలో మృతుడి మొహం ఛిద్రమైంది. లోకో పైలట్ ఫిర్యాదు మేరకు నెల్లూరు రైల్వే పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద డ్రైవింగ్ లైసెన్స్, బైక్ ఆర్సీ, ఓటర్ ఐడీ కార్డు, ఫోన్‌ను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి ఆధారంగా బెంగళూరులోని జీవనహళ్లి మారుతీసేవానగర్‌కు చెందిన శశికుమార్ (31)గా భావిస్తున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ప్రమాదంలో సెల్‌ఫోన్ దెబ్బతినడంతో అందులోని సిమ్‌లను సేకరించి దాని ఆధారంగా వివరాలను సేకరించే పనిలో ఉన్నారు. లోకో పైలట్ హారన్ కొడుతున్నా, యువకుడు నేరుగా వచ్చి రైలు కింద పడ్డారని పోలీసులు తెలిపారు. బెంగళూరుకు చెందిన యువకుడు నెల్లూరు ఎందుకొచ్చారు.. ఇక్కడ ఏమిచేస్తున్నారు.. ఎందుకు రైలుకిందపడాల్సి వచ్చిందనే వివరాలు తెలియరావాల్సి ఉంది. నెల్లూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా


మాట్లాడుతున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ముస్లింలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యమిస్తోందని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 53, 54వ డివిజన్లకు సంబంధించి భగత్‌సింగ్ కాలనీలోని కమ్యూనిటీ హాల్.. 42, 43, 48వ డివిజన్లకు సంబంధించిన గృహ సారథులకు శిక్షణ తరగతులను కోటమిట్టలోని షాదీ మంజిల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గృహ సారథులు ప్రతి గడపకూ వెళ్లి గత ప్రభుత్వం ఏమి చేసింది.. మన ప్రభుత్వం ఏమి చేస్తోందనే అంశాలను తెలియజేయాలని కోరారు. సంక్షేమ పథకాలను వివరిస్తూ వారికి భరోసా కల్పించాలన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు సుజాత, సఫియా, కరిముల్లా, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు జమీర్, పార్టీ 48వ డివిజన్ ఇన్‌చార్జి సిద్ధిక్, తదితరులు పాల్గొన్నారు.

నోరు మూసి.. చంపేస్తామని బెదిరించి

• వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాల దోపిడీ
• ఘటన స్థలాన్ని పరిశీలించిన నగర డీఎస్పీ


బాధితురాలితో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి నోరు మూసి.. అరిస్తే చంపుతామని బెదిరించి.. ఒంటిపై ఉన్న 8 సవర్ల బంగారు ఆభరణాలను ఇద్దరు దుండగులు గురువారం పట్టపగలు దోచుకెళ్లిన ఘటన ఏసీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. ఏసీనగర్ పోస్టాఫీస్ వీధిలోని రెండంతస్తుల భవనంలో వృద్ధురాలు హేమలత పైపోర్షన్లో ఒంటరిగా నివాసం ఉంటున్నారు. కింది పోర్షన్లో ఆమె బంధువు నివాసం ఉంటున్నారు. ఆమె కుమారుడు డాక్టర్ కిరణ్ నవాబుపేట పోలీస్‌స్టేషన్ పక్కన వైద్యశాలను నిర్వహిస్తున్నారు. ఏసీనగర్‌లోని కెనరా బ్యాంక్‌లో రూ.10 లక్షలను గురువారం ఆమె డ్రా చేసి ఆటోలో ఇంటికెళ్లారు. తలుపు వేయడాన్ని మరిచి లోపలికెళ్లారు. మధ్యాహ్నం 2.30 ప్రాంతంలో భోజనం చేస్తుండగా, గుర్తుతెలియని ఇద్దరు దుండగులు సార్.. సార్ అంటూ పిలిచారు. వరండాలోని గేట్ వద్దకు వచ్చి.. వారిని చూడగానే అనుమానం కలిగి గడియ వేసేందుకు ఆమె యత్నించారు. అయితే దుండగులు గేట్లను గట్టిగా నెట్టి లోపలికి ప్రవేశించారు. ఊహించని పరిణామంతో కంగుతిన్న వృద్ధురాలు కేకలేసేందుకు యత్నించగా, ఆమె నోరు మూసి.. అరిస్తే చంపుతామని బెదిరించి వరండాలోని మంచంపై కూర్చోబెట్టారు. ఆమె ఒంటిపై ఉన్న ఎనిమిది సవర్ల బంగారు గాజులు, సరుడు, తదితరాలను దోచుకొని పరారయ్యారు. కొద్దిసేపటికి తేరుకున్న వృద్ధురాలు దొంగా.. దొంగా అని అరిచి కిందికి వచ్చి చూసేసరికి దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో విషయాన్ని తన కుమారుడికి ఫోన్ ద్వారా తెలియజేశారు. బాలాజీనగర్ పోలీసులకు ఆయన సమాచారం అందించారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాములునాయక్‌లు ఘటన స్థలానికి చేరుకొని దోపిడీ జరిగిన తీరును పరిశీలించారు. నిందితులు 30 నుంచి 40 ఏళ్లలోపు వారని, ఒకరు పొట్టిగా.. మరొకరు పొడుగ్గా కోల మొహంతో తెల్లచొక్కా వేసుకొని ఉన్నారని పోలీసులకు వృద్ధురాలు తెలిపారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఘటన స్థలంతో పాటు బాలాజీనగర్, ఏసీనగర్, విజయమహల్ గేట్, మందాకిని బార్, హైవేకి వెళ్లే అన్ని రహదారుల్లో వాహన తనిఖీలను చేపట్టారు. సీసీ ఫుటేజీలను సేకరిస్తున్నారు.

వెంబడించి మరీ..

ఆటోలో వస్తున్న వృద్ధురాలి ఒంటిపై బంగారు ఆభరణాలు ఉండటాన్ని గమనించిన దుండగులు ఆమెను వెంబడించి దోపిడీకి పాల్పడ్డారని తెలుస్తోంది. దోపిడీ జరిగిన సమయంలో రెండు వీధుల అవతలే కిరణ్ ఉన్నారని చెప్తున్నారు. తాను సకాలంలో వెళ్లుంటే దోపిడీ జరిగేది కాదని ఆయన తెలిపారు. కాగా నగరంలో నాలుగు రోజుల వ్యవధిలో రెండు దోపిడీలు, భారీ చోరీ జరగడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు.

మహాకుంభాభిషేక మహోత్సవానికి మంత్రికి ఆహ్వానం



నెల్లూరు(సెంట్రల్): సూళ్లూరుపేటలో వెలసిన చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారి మహాకుంభాభిషేక మహోత్సవానికి రావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గురువారం ఆహ్వానించారు. ఈ మేరకు నగరంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 22 నుంచి 24 వరకు మహోత్సవాలను నిర్వహించనున్నామని చెప్పారు.

మహిళా ఉద్యోగుల చర్చావేదిక



నెల్లూరు రూరల్: ప్రభుత్వోద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీజీఈఓ మహిళా విభాగ జిల్లా చైర్‌పర్సన్ విజయనిర్మల కోరారు. నగరంలోని రూరల్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా ఉద్యోగులతో చర్చా వేదికను గురువారం నిర్వహించారు. మహిళా విభాగ కన్వీనర్ సుజాతాబాయి, నేతలు ఉమారాణి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



నెల్లూరు (అర్బన్): నగరంలోని వైకుంఠపురంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పావని కుటుంబానికి నిత్యావసర సరుకులు, 25 కిలోల బియ్యాన్ని విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. నగరానికి చెందిన అనూష జన్మదినాన్ని పురస్కరించుకొని వీటిని అందజేశామని ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్యాణి పేర్కొన్నారు. ఫౌండేషన్ సభ్యులు రాధ, రాములు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగిపై దాడి దారుణం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్న హరిప్రసాద్‌పై దాడి దారుణమని విద్యుత్ శాఖ ఉద్యోగులు, లైన్‌మెన్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌కు గురువారం చేరుకున్న వారు హరిప్రసాద్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరిబాబు మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులకు సహకరించాల్సిన వినియోగదారులు దాడులు చేయడం సరికాదని సూచించారు. దాడికి పాల్పడిన మహబుల్లాపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. యూఈఈయూ నేతలు హరినారాయణ, నాగయ్య, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేట దర్గా పవిత్రతను కాపాడాలి


వినతిపత్రమిస్తున్న ఐద్వా నేతలు

నెల్లూరు (అర్బన్): ఏఎస్‌పేట దర్గా పవిత్రతను కాపాడటంతో పాటు అక్కడ మహిళా మానసిక రోగులపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలని ఐద్వా నేతలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఏఓ షఫీమాలిక్‌కు వినతిపత్రాన్ని గురువారం అందజేసిన అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్‌బీ మాట్లాడారు. దర్గా పీఠాధిపతి హాఫీజ్ పాషా దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఆయనపై కఠిన చర్యలు చేపట్టి శిక్షించాలని కోరారు. సంఘ నగర, రూరల్ కార్యదర్శులు పద్మ, షాహినా బేగం, జిల్లా కమిటీ సభ్యులు షంషాద్, జాకీరా, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సత్కారం



నెల్లూరు(బృందావనం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా తృతీయ సమావేశాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్య శాఖలోని 38 మంది విశ్రాంత అధికారులు, ఉద్యోగులను సత్కరించారు. షీల్డులను అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు విద్యాసాగర్ అందజేశారు. అనంతరం జిల్లా హాస్పిటల్ సర్వీసెస్ కో ఆర్డినేటర్ డాక్టర్ రమేష్‌నాథ్‌ను సన్మానించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, మోహన్‌బాబు, కోశాధికారి సువర్ణపాల్, ఏపీజీఎఫ్, హంస జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, డాక్టర్లు ఇఫ్తికర్ అహ్మద్, రంగారావు, పేరారెడ్డి, సాయిప్రతాప్‌సింగ్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వెండి పూజాసామగ్రి బహూకరణ



నెల్లూరు(బృందావనం): నగరంలో కొలువైన రాజరాజేశ్వరి అమ్మవారికి వెండి వింజామరలు, నివేదన పాత్ర, వెండిపళ్లేన్ని మల్లేశ్వరశర్మ, పద్మజ దంపతులు గురువారం బహూకరించారు. తొలుత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ గిరికృష్ణ, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ లక్ష్యాలను సాధించాలి

• డీఎంహెచ్‌ఓ పెంచలయ్య


రికార్డులను పరిశీలిస్తున్న పెంచలయ్య

నెల్లూరు(అర్బన్): కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు సంబంధించిన లక్ష్యాలను సాధించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య సూచించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రసూతి విభాగంలో పలు పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బందికి గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు సంబంధించిన రికార్డులు పక్కాగా ఉండాలని ఆదేశించారు. ప్రతి పీహెచ్‌సీలో లక్ష్యాలకు అనుగుణంగా ఆపరేషన్లు జరగాలన్నారు. స్త్రీలకు ట్యూబెక్టమీతో పాటు మగవారికి వ్యాసెక్టమీ ఆపరేషన్లు నిర్వహించాలని సూచించారు. కుటుంబ నియంత్రణతో అధిక జనాభాను నియంత్రించ ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు మేలు జరుగుతుందని వివరించారు. శస్త్రచికిత్సలపై కుటుంబ నియంత్రణ అధికారి వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య శ్రీ కో ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, స్టాటిస్టికల్ ఆఫీసర్ సహన, ఇనమడుగు, తదితరులు పాల్గొన్నారు.